క్లుప్తంగా

పార్టీ కార్యాలయాల్లో వినతులు స్వీకరణ అభ్యంతరకరం

లక్ష్మీపురం: ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కార్యాలయాలకు ప్రత్యామ్నాయంగా తెలుగుదేశం, జనసేన పార్టీ కేంద్ర కార్యాలయాలను మార్చి వేయడాన్ని ఖండిస్తున్నట్లు కమ్యూనిస్ట్ ఇండియా జాతీయ కార్యదర్శి తోట సంగమేశ్వర రావు (సంగమ్) శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. మంగళగిరిలోని తెలుగుదేశం, జనసేన పార్టీ కార్యాలయాల వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అధికార హోదాలో ఫిర్యాదులు స్వీకరించటం సరైన వైఖరి కాదన్నారు. నీతి తప్పిన రాజకీయానికి ఇది నిదర్శనమని విమర్శించారు.

కేసులు ఎత్తివేయాలి

గుంటూరు మెడికల్: రాజధాని ఉద్యమంలో పెట్టిన కేసులను ఎత్తివేయాలని అమరావతి రైతు ఐక్యకార్యాచరణ సమితి అధ్యక్షుడు మాదల శ్రీనివాసు అన్నారు. శనివారం గుంటూరు చంద్రమౌళి నగర్‌లో విలేకరుల సమావేశంలో అమరావతి ఉద్యమంలో అసువులు బాసిన వారికి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన మాట్లాడుతూ అమరావతి రాజధాని అభివృద్ధి కోసం నిధులు మంజూరు విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సానుకూలంగా ఉండటం శుభపరిణామమని పేర్కొన్నారు. సమావేశంలో అమరావతి రైతు ఐక్య కార్యాచరణ సమితి సభ్యులు ధనేకుల రామారావు, బెల్లంకొండ నరసింహారావు, కొమ్మినేని సత్యనారాయణ, చలపతిరావు, బాలమురళి, జమ్ముల శ్యాం కిషోర్, సతీష్ కొండపాటి, రాజేంద్ర పాల్గొన్నారు.

ఏసీ బాక్స్ చోరీ

గుంటూరు ఈస్ట్: ప్రభుత్వ కార్యాలయం బయట ఉన్న ఏసీ బాక్స్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఆర్డీవో కార్యాలయం సమీపంలో గల ఎన్టీఆర్ విద్యా సేవ కార్యాలయం కిటికీ వెనుక ఉండే అవుట్ డోర్ యూనిట్‌ను శుక్రవారం రాత్రి చోరీ చేశారు. ఘటనపై అధికారి విజయప్రకాష్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైస్‌మిల్లులో రేషన్ బియ్యం స్వాధీనం



ప్రత్తిపాడు: రైస్ మిల్లులో రంగు రంగుల బస్తాల్లో నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు... వట్టిచెరుకూరు మండలం అనంతవరప్పాడులోని శ్రీ వల్లి రైస్ మిల్లులో నిబంధనలకు విరుద్ధంగా రేషన్ బియ్యాన్ని నిల్వ చేశారన్న సమాచారం జిల్లా జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ్‌కు అందింది. దీంతో జేసీ ఆదేశాల మేరకు శనివారం ప్రత్తిపాడు సివిల్ సప్లయిస్ డీటీ పద్మజ రైస్ మిల్లులో తనిఖీలు నిర్వహించారు. తాజ్‌మహల్ పేరుతో రంగుల గోతాల్లో బియ్యం నింపి ఉండటాన్ని గమనించారు. ప్యాకెట్లులో ఉన్న బియ్యాన్ని పరిశీలించి రేషన్ బియ్యమేనని ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. మొత్తం 541 బ్యాగుల్లో ఉన్న 22,290 కేజీల రేషన్ బియ్యంతో పాటు, 96 బ్యాగుల్లో ఉన్న 4,490 కేజీల నూకలను స్వాధీనం చేసుకున్నారు. రైస్ మిల్లు నిర్వాహకులపై 6 ఏ కేసు నమోదు చేసినట్లు వట్టిచెరుకూరు ఇన్‌చార్జి తహసీల్దార్ కె.రవిబాబు తెలిపారు. సీజ్ చేసిన బియ్యాన్ని తెనాలిలోని బఫర్ గోడౌన్‌కు తరలించినట్లు చెప్పారు.

రాత్రి విధుల నుంచి మినహాయించాలి

పెదకాకాని: గ్రామ రెవెన్యూ సహాయకులకు జాబ్ చార్టు నిబంధనలకు విరుద్ధంగా వేసిన రాత్రి డ్యూటీల నుంచి మినహాయింపు ఇవ్వాలని సీఐటీయూ కార్యదర్శి నన్నపనేని శివాజీ పేర్కొన్నారు. పెదకాకాని మండలంలో గ్రామ రెవెన్యూ సహాయకులతో కలిసి శనివారం జూనియర్ అసిస్టెంట్ ఆదిలక్ష్మికి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ.. గ్రామ సహాయకులను నైట్ వాచ్‌మెన్, అటెండర్లుగా ఉపయోగించవద్దని గతంలో సీసీఎల్ఏ అధికారి ఆదేశించారని చెప్పారు. తెలంగాణ తరహాలో పేస్కేల్ ఇవ్వాలని కోరారు. ఖాళీ పోస్టులలో అర్హులైన వీఆర్‌ఏలను నియమించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ సహాయకులు బుల్లా సురేష్‌కుమార్, రమేష్, నాగయ్య, దేవ భిక్షయ్య, షేక్ లాల్, పెద్దిపాగ సుబ్బారావు, గంపల జ్యోతి, పకీరయ్య తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు ఆషాఢం సారె

తాడేపల్లిరూరల్: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని పాత మంగళగిరి దుర్గానగర్‌లోని శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలోని అమ్మవారికి మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ మన్నెం రమేష్ బాబు, అనిత దంపతుల ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఆషాఢ సారె సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళకు పసుపు, కుంకుమ, తాంబూలాలు అందజేశారు. కార్యక్రమంలో భక్తబృందం ప్రతినిధులు తలశీల జయలక్ష్మి, ఆలూరి వాసంతి, కారంపూడి ఓంకార మూర్తి పాల్గొన్నారు.

ఎముకలు కీలుకం

- ప్రతి ఏడాది పెరుగుతున్న ఆర్థోపెడిక్ సమస్యలు
- ఆధునిక జీవనశైలితో యుక్త వయస్సులోనే కీళ్ల సమస్యలు

నేడు బోన్ అండ్ జాయింట్ డే



బోన్ అండ్ జాయింట్ డే పోస్టర్లు

గుంటూరు మెడికల్: మనిషి నిలబడాలన్నా.. కూర్చోవాలన్నా.. పరుగెత్తాలన్న ఏదైనా పనులు చేయాలన్నా.. ఎముకలు పటిష్టంగా ఉంటేనే సాధ్యమవుతోంది. ఆధునిక జీవన శైలి వలన ప్రతిఏడాది ఆర్థోపెడిక్ సమస్యల బారిన పడుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరిగిపోతుంది. ఆర్థోపెడిక్ సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఇండియన్ ఆర్థోపెడిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2012 నుంచి భారతదేశంలో బోన్ అండ్ జాయింట్ డే ను నిర్వహిస్తున్నారు.

సమస్యలకు కారణం..

ఆధునిక జీవన శైలి వలన ఎక్కువ మంది ఏసీలకే పరిమితమై కొంత సేపు కూడా సూర్యరశ్మి సోకకుండా గదుల్లోనే ఉండి పోతున్నారు. దీంతో విటమిన్ డీ లోపంతో ఎముకల పటుత్వం తగ్గిపోతోంది. పాస్ట్‌ఫుడ్స్ ఎక్కువగా తీసుకోవడం, వ్యాయామం చేయకపోవడం ద్వారా కూడా ఒబెసిటి పెరిగిపోయి ఆర్థోపెడిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. వయస్సు పైబడిన వారు సహజ సిద్ధంగా తమ శరీరంలో తగ్గిపోయే కాల్షియంను తిరిగి భర్తీ చేసుకోకుండా నిర్లక్ష్యం చేయడం ద్వారా పెద్దవారిలో ఆర్థోపెడిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. స్మోకింగ్ కూడా కాల్షియం పెరగకుండా ఎముకల అరుగుదలకు కారణమవుతోంది. జిల్లా వ్యాప్తంగా ఆర్థోపెడిక్ సర్జన్లు 350 మంది ఉన్నారు. ప్రతిరోజూ ఒక్కో వైద్యుడి వద్ద 50 మంది వివిధ రకాల సమస్యలతో చికిత్స పొందుతున్నారు.

జీజీహెచ్‌లో ఉచితంగా కార్పొరేట్ వైద్యం..

గుంటూరు జీజీహెచ్‌లో ఆర్థోపెడిక్ సమస్యలకు సోమవారం నుంచి శనివారం వరకు ప్రతిరోజూ ఓపీ విభాగంలో ఉచిత సేవలందిస్తున్నారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి క్యాజువాలిటీలో 24 గంటలూ వైద్యులు అందుబాటులో ఉండి, ఆపరేషన్లు చేస్తున్నారు. కార్పొరేట్ ఆస్పత్రుల కంటే దీటుగా అత్యాధునిక మాడ్యూలర్ ఆపరేషన్ థియేటర్లు, సీఆర్మ్ వైద్య పరికరాలతో ఆపరేషన్లు ఉచితంగా చేస్తున్నారు. ప్రతిరోజూ 300 మంది ఓపీ విభాగంలో వైద్య సేవలు పొందుతున్నారు. ప్రతిరోజూ సాధారణ, ఎమర్జెన్సీ ఆపరేషన్లు పదికి పైగా చేస్తున్నారు.

యుక్తవయస్సులోనే కీళ్ల అరుగుదల



వయస్సు పెరిగే కొద్ది జాయింట్లు అరిగిపోవడం సహజంగా జరుగుతోంది. కానీ ఆధునిక జీవనశైలి వల్ల యుక్తవయస్సులోనే కీళ్లు అరిగిపోతున్నాయి. కీళ్ల అరుగుదలను ముందస్తుగా గుర్తిస్తే ఆపరేషన్‌తో పనిలేకుండా తగ్గించవచ్చు. బీఎంఆర్ హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్టుకు చెందిన ఉన్నతి ఫౌండేషన్ ద్వారా గతంలో గుంటూరు జీజీహెచ్‌లో సుమారు వంద మందికి ఉచితంగా మోకీలు మార్పిడి ఆపరేషన్లు చేశాం. తెలుగు రాష్ట్రాల్లో అనేక గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగులకు, హెల్త్ ఇన్సూరెన్సు కార్డుల ద్వారా సాధారణ ప్రజలకు ఉచితంగా మోకీలు మార్పిడి ఆపరేషన్ చేస్తున్నాం.

– డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి,
సీనియర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, గుంటూరు

జాగ్రత్తలతో ఎముకలు పదిలం



బోన్ అండ్ జాయింట్ డేను పురస్కరించుకుని క్యాల్షియం ఆవశ్యకత గురించి, రోడ్డు ప్రమాదాల్లో ప్రథమ చికిత్సపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఎముకలు బలంగా ఉండాలంటే ప్రతిరోజూ తప్పనిసరిగా సమీకృత ఆహారం తీసుకోవాలి. గుడ్డు, పాలు, రాగిజావ, పాలకూర ఆహారంతో పాటు ప్రతిరోజూ వ్యాయామం చేయాలి. ఊబకాయం లేకుండా చూసుకోవాలి. జంక్‌ఫుడ్, స్మోకింగ్‌కు దూరంగా ఉండాలి. మహిళలు 40 ఏళ్లు దాటితే తప్పనిసరిగా ఎముకల ఆరోగ్యంపై దృష్టి సారించి ప్రత్యేక ఆహారం తీసుకోవాలి.

– డాక్టర్ జి.నరేష్‌బాబు, సీనియర్ స్పైన్ సర్జన్, గుంటూరు

బాలచంద్రరావు స్మారక పురస్కారాలు ప్రదానం



విజయలక్ష్మికి బాలచంద్రరావు స్మారక పురస్కారం అందిస్తున్న అతిథులు

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై శనివారం రాత్రి బాలచంద్ర ఆర్ట్స్ అకాడమి ఆవిష్కరణ దినోత్సవ సభ నిర్వహించారు. తొలుత అతిథులు, అకాడమి నూతన కార్యవర్గం జ్యోతి ప్రజ్వలన చేసి, బాలచంద్రరావు చిత్రపటానికి నివాళులర్పించారు. సభకు ప్రముఖ రంగస్థల, టీవీ, సినీ నటుడు డాక్టర్ చిట్టినేని లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విచ్చేసిన అతిథులు మాట్లాడుతూ ప్రముఖ రంగస్థల నటుడు మంచా బాలచంద్రరావు పేరుతో అకాడమి నెలకొల్పడం అభినందనీయమని అన్నారు. అనంతరం ప్రముఖ రంగస్థల నటుడు, దర్శకులు డాక్టర్ ఎంవీ నరసింహారావు, కావూరి సత్యనారాయణ, నాట్యాచార్యుడు డాక్టర్ కాజా వెంకట సుబ్రహ్మణ్యం, రంగస్థల నటి అమ్మని విజయలక్ష్మిలకు బాలచంద్రరావు స్మారక పురస్కారాలు అందించి, సత్కరించారు. శ్రీసాయిమంజీర కూచిపూడి ఆర్ట్స్ అకాడమి విద్యార్థులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం అలరించింది. సభలో ఆలయ కమిటీ అధ్యక్షులు సిహెచ్.మస్తానయ్య, హార్మోనిస్టు శిరిగిరి సాంబశివరావు, చింతల ఆనంద్, మంచా అష్టదళ పద్మావతిదేవి, ఎం.గణేష్, ఎల్.శంకర్ పాల్గొన్నారు.

కాలుష్య రహిత దేశంగా భూటాన్

అస్సాం అగ్రికల్చర్ యూనివర్సిటీ అధ్యాపకుడు ప్రొఫెసర్ ఎల్లా రత్తయ్య



రత్తయ్యను సన్మానిస్తున్న వీసీ తదితరులు

ఏఎన్‌యూ: ప్రపంచంలో కాలుష్య రహిత దేశంగా భూటాన్ ఉందని, అక్కడ 70 శాతం అటవీ ప్రాంతం ఉందని అస్సాం అగ్రికల్చర్ యూనివర్సిటీ అధ్యాపకుడు ప్రొఫెసర్ ఎల్లా రత్తయ్య తెలిపారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ బోటనీ, మైక్రో బయాలజీ విభాగం ఆధ్వర్యంలో 'ట్రీస్ విస్ గ్లోబల్ వార్మింగ్ అండ్ క్లైమేట్ చేంజ్' అనే అంశంపై శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన కీలకోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆచార్య రత్తయ్య ప్రసంగిస్తూ గ్లోబల్ వార్మింగ్ అనేది సీవో–2లో మార్పులు పెరగటం వల్ల వస్తుందన్నారు. ప్రస్తుతం కార్బన్ ఫుట్ ప్రింట్స్ వల్ల కార్బన్ డయాక్సైడ్ తగ్గించవచ్చని తెలిపారు. అమెరికా అధికంగా గ్లోబల్ వార్మింగ్‌కి కారణం అవుతోందని వెల్లడించారు. 2070కి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నెట్ జీరో లేదా సీవో–2 పొల్యూషన్ రహిత దేశంగా భారతదేశాన్ని నిలిపేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారని చెప్పారు. ప్రస్తుత పరిస్థితులలో జపాన్‌కి చెందిన అకిరా మియా వకీ మెథడ్‌ని అనుసరించి తాను ఎక్కువ లేయర్స్ రకాలైన మొక్కలను గుంటూరులోని కొరటిపాడు ట్యాంక్, వాకింగ్ ట్రాక్ లో ఏర్పాటు చేయించానని తెలిపారు. ముఖ్య అతిథిగా హాజరైన వీసీ గంగాధరరావు మాట్లాడుతూ మొక్కల పెంపకంలో ఆచార్య రత్తయ్యను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. వీరయ్య పర్యావరణ సంరక్షణలో మొక్కల పాత్రను వివరించారు. ఎన్విరాన్మెంటల్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ బ్రహ్మాజీరావు గ్లోబల్ వార్మింగ్ అండ్ క్లైమేట్ చేంజ్ పైన, జాతీయ, అంతర్జాతీయ రెగ్యులేషన్స్‌ను వివరించారు. సదస్సు నిర్వహణ ఉద్దేశాన్ని విభాగాధిపతి ఆచార్య మల్లికార్జున తెలిపారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమగ్ర కుల గణనతోనే దేశాభివృద్ధి

నెహ్రూనగర్ : సమగ్ర కుల గణనతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు పేర్కొన్నారు. గుంటూరు చుట్టుగుంటలోని రాష్ట్ర యువజన సంఘ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశానికి వెన్నెముకగా ఉండాల్సిన ప్రధాన ఉత్పత్తి కులాలైన ఓబీసీలు నేడు న్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని తెలిపారు. భారత్ ప్రపంచంలో అభివృద్ధి చెందిన అగ్రరాజ్యంగా ఎదగాలని కలలు కంటున్న పాలకులు ముందుగా అత్యధిక జనాభాగా ఉన్న బీసీల అభివృద్ధితోనే సాధ్యమని తెలుసుకోవాలని కోరారు. జనగణనలో కుల గణన జరపడం ఒక్కటే సరైన మార్గమని అభిప్రాయపడ్డారు. జాతీయస్థాయిలోని అన్ని ఓబీసీ సంఘాలు, కుల సంఘ నాయకులందరూ ఈ నెల 9న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించనున్న బీసీల చారిత్రాత్మక ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. బీసీ సంక్షేమ సంఘ జాతీయ ప్రధాన కార్యదర్శి, యువజన విభాగ రాష్ట్ర అధ్యక్షుడు కుమ్మర క్రాంతి కుమార్ మాట్లాడుతూ కేంద్రంలో ఓబీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలన్నా, ఓబీసీ సబ్ ప్లాన్‌తో పాటు బడ్జెట్లో జనాభా దామాషా మేరకు కేటాయింపులు జరపాలన్నా, ముందుగా జనగణన తెలియాల్సిందేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఉప్పాల రాజ్ కిరణ్, శివరాం బాబాజీ, కొల్లూరు హనుమంతరావు, స్వాతి గౌడ్, ఆళ్ల శివాజీ, జి. జయలక్ష్మి, విజయ్ పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం వద్దు



ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్న కమిషనర్ హరికృష్ణ

నగర కమిషనర్ ఎస్.హరికృష్ణ

నెహ్రూనగర్: తాగునీటి సరఫరా సమయంలో అశ్రద్ధ వద్దని, పరీక్షలు తప్పనిసరని నగర కమిషనర్ ఎస్.హరికృష్ణ చెప్పారు. ఎక్కడైనా కలుషిత నీటి సరఫరా జరిగితే యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. శనివారం సీడీఎంఏ(కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్) నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో వార్డు సచివాలయ ఎమినిటీ కార్యదర్శులు నిత్యం తాగునీటి సరఫరాపై అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఎక్కడైనా తాగునీరు కలుషితం అయినట్లు గుర్తిస్తే వెంటనే చర్యలు తీసుకోవాలని తెలిపారు. తాగునీటి కాలుష్యంపై అందే ఫిర్యాదుల్ని అధిక ప్రాధాన్యతతో పరిష్కరించాలని స్పష్టం చేశారు.

పూడికతీతపై సమగ్ర నివేదిక ఇవ్వాలి

అన్న క్యాంటీన్ల మరమ్మతు పనులపై రోజువారీ పురోగతి రిపోర్ట్ ఇవ్వాలని, సోమవారం నాటికి పూర్తి చేయాలని కమిషనర్ తెలిపారు. ప్రధాన అవుట్ ఫాల్ డ్రెయిన్‌లో పూడికతీత ఎక్కడైనా పెండింగ్ ఉంటే వెంటనే తీయించాలని చెప్పారు. సోమవారం నాటికి పూడికతీతపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. నగరంలో ప్రజారోగ్య పరిరక్షణలో పారిశుద్ధ్యం కీలకమని, ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతం జరగాలని తెలిపారు. డివిజన్ల వారీగా మెరుగైన పారిశుద్ధ్యానికి శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చర్యలు తీసుకోవాలని చెప్పారు. విభాగాల వారీగా అర్జీ, దరఖాస్తుల్ని నిర్దేశిత గడువులోగా పరిష్కారం చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మి, ఎస్ఈ. ఎం.శ్యాం సుందర్, అధికారులు పాల్గొన్నారు.

కార్యాలయాన్ని శుభ్రంగా ఉంచాలి

నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయాన్ని పరిశుభ్రంగా ఉంచాలని కమిషనర్ అధికారుల్ని ఆదేశించారు. డెప్యూటీ కమిషనర్ సీహెచ్.శ్రీనివాస్, మేనేజర్ ప్రసాద్‌తో కలిసి శనివారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయాన్ని, పార్కింగ్ పనులను పరిశీలించి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జీఎంసీ ప్రధాన కార్యాలయాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ఇతర కార్యాలయాలకు ఆదర్శంగా ఉండాలని సూచించారు. పార్కింగ్‌కు కేటాయించిన స్థలంలో కొంత మేర మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు.

కార్యకర్తలకు అండగా ఉంటా



గుంటూరు రూరల్: నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. శనివారం ఏటుకూరు బైపాస్‌లోని నియోజకవర్గం కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలను ఆయన కలిసి వారి సమస్యలు పరిస్థితులు తెలుసుకున్నారు. కార్యకర్తలకు ధైర్యం చెప్పి ఎటువంటి సమస్య ఎదురైనా తాను, వైఎస్సార్ సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఎన్నికలు పూర్తయిన అనంతరం గ్రామాల్లో జరిగిన వివాదాలు, సమస్యలపై స్థానిక నాయకులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని నాయకులు కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్‌లో కార్గిల్ స్మారక చిహ్నం



గుంటూరు రూరల్: కార్గిల్ విజయ్ దివస్ 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గోరంట్ల గ్రామంలోని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో కార్గిల్ స్మారక చిహ్నాన్ని ఏర్పాటు చేశారు. ఆంధ్రా, తెలంగాణ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో కార్గిల్ నుంచి తెచ్చిన మట్టిలో ఒక మొక్కను అమర్చి 10ఏ ఆంధ్రా బాలికల బెటాలియన్‌కు అందజేశారు. ఆవిధంగా ఏర్పాటు చేసిన మొక్కలను శనివారం 10ఏ ఆంధ్రా బాలికల బెటాలియన్ ఆడమ్ ఆఫీసర్ మేజర్ పి.అవినాషి పట్వాల్, కళాశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ సంధ్య చేతుల మీదుగా కళాశాల ఆవరణలో మొక్కను నాటి కార్గిల్ స్మారక చిహ్నాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్గిల్ యుద్ధంలో వీరమరణం పొందిన సైనికులకు నివాళులర్పించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని సూచించారు. కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ కె.సుస్మిత, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

విజ్ఞాన రంగంలో ఫార్మసీ విద్యకు ప్రత్యేక స్థానం

చలపతి ఫార్మసీలో ముగిసిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శన



బహుమతులు అందజేస్తున్న దృశ్యం

గుంటూరు రూరల్: సైన్స్ రంగంలో ఫార్మసీ విద్యకు ప్రత్యేక స్థానం ఉందని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం జువాలజీ విభాగం ప్రొఫెసర్ పీవీ కృష్ణ తెలిపారు. గత రెండు రోజులుగా నగర శివారుల్లోని లాం నందున్న చలపతి ఫార్మసీ కళాశాలలో జరుగుతున్న 17వ విద్యా వైజ్ఞానిక ప్రదర్శన శనివారంతో ముగిసింది. కళాశాల సెక్రటరీ వై.సుజిత్ అధ్యక్షతన జరిగిన ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏఎన్‌యూ ప్రొఫెసర్ మాట్లాడుతూ మారుతున్న టెక్నాలజీ సహాయంతో ఫార్మసీ రంగంలో అద్భుతాలు సృష్టించి నూతన ఔషధాలను తయారు చేసే బాధ్యత ఫార్మసీ విద్యార్థులదేనన్నారు. నారాయణ విద్యాసంస్థల డీన్ డాక్టర్ డి.శ్రీనివాసరావు మాట్లాడుతూ నేటి బాలలే రేపటి యువతని, ఉన్నత పాఠశాల్లో, కళాశాలల్లో 9, 10 తరగతులు చదువుతున్న, ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు ఫార్మసీ రంగంపై అవగాహన కల్పించటం ఎంతో అవసరమన్నారు. నారాయణ జువాలజీ ప్రొఫెసర్ డాక్టర్ సాయిరామ్ మాట్లాడుతూ ప్రస్తుతం పెరుగుతున్న జనాభా, మారుతున్న టెక్నాలజీతోపాటు వ్యాధులు అదేవిధంగా పెరుగుతున్నాయని, వ్యాధుల నివారణకు ఫార్మాశిస్టులు ముఖ్య పాత్ర పోషిస్తారన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు మాట్లాడుతూ ప్రదర్శనలో యాక్సిలరేటెడ్ స్టెబిలిటీ స్టడీస్, ఔషధ విసర్జన, కంపార్ట్‌మెంట్ మెడల్స్, ప్లాంట్ టిష్యూకల్చర్, ట్విన్స్ ఆఫ్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, గి బ్లూప్రింట్ ఆఫ్ లైఫ్, ఇంటికేటర్స్, పోర్టిఫైడ్ ఫుడ్ టెస్టింగ్, వాటర్ ఫౌంటెన్, ఎల్‌సీఎంఎస్, ఇమ్యునైజేషన్, కిడ్నీలలో వడపోత, ఆక్వాపోనిక్స్, టాక్సికాలజీ లక్షణలు, మూత్రపిండాల రుగ్మతలు, డయాలసిస్ వంటి ప్రదర్శనలు ఆకట్టుకున్నాయన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యే రామాంజనేయులుకు వినతి పత్రం అందజేస్తున్న కార్మిక సంఘం నాయికులు

లక్ష్మీపురం: జీవో నంబర్ 17ను రద్దు చేసి, భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని సంఘం నాయకులు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ప్రత్తిపాడు శాసనసభ్యులు బూర్ల రామాంజనేయులును శనివారం కలిసి వినతి పత్రం అందజేశారు. సంఘం అధ్యక్షుడు పుప్పాల సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డెప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తామని మేనిఫెస్టోలో పెట్టారని గుర్తు చేశారు. సంక్షేమ బోర్డును పునరుద్ధరించి పెండింగ్‌లో ఉన్న 42 వేల క్లైంల నిధులు మంజూరు చేసి కార్మికుల్ని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్, నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకిటి అరుణ్ కుమార్, మేడా హనుమంతరావు, నగర అధ్యక్షుడు రావుల అంజిబాబు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జంగాల చైతన్య, సీపీఐ నాయకులు రామిశెట్టి ఆదేశ్వరరావు, నూతలపాటి చిన్న, ఎస్.దేవానాయక్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల్ని తక్షణం పరిష్కరించాలి

ఎమ్మెల్యే నసీర్ అహ్మద్



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

గుంటూరు ఈస్ట్: నియోజకవర్గంలో విద్యుత్ సమస్యల్ని తక్షణం పరిష్కరించాలని ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ అధికారులకు సూచించారు. మద్దిరాల కాలనీలో విద్యుత్ లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి అధికారులు రూ. 9 లక్షలతో 100 ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో కాలనీలో సమస్య పరిష్కారమైందని తెలిపారు. అధికారులు కూడా విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. నగర ప్రజలు కూడా విద్యుత్ సమస్యల్ని వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసబాబు, డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ హుస్సేన్‌ఖాన్, ఏఈ బాజీ, అధికారులు పాల్గొన్నారు.

నర్సింగ్ సిబ్బంది సమస్యలపై మంత్రికి వినతి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

గుంటూరు మెడికల్: నర్సింగ్ ఆఫీసర్స్ సమస్యలపై శనివారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్‌కు నర్సుల సంఘం నేత వెల్లంపల్లి పద్మజ గుంటూరు జీజీహెచ్‌లో వినతి పత్రం అందజేశారు. జీజీహెచ్‌లో గర్భిణులు, బాలింతల్ని ఒక్కో బెడ్‌పై ఇద్దరు, ముగ్గురుని ఉంచుతున్నారని తెలిపారు. మాతా శిశు సంరక్షణ భవనం త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని కోరారు. జీజీహెచ్ నర్సింగ్ స్కూల్, హాస్టల్‌కు భవనాలు లేవని, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక చొరవ చూపించాలని విజ్ఞప్తి చేశారు. కాంట్రాక్ట్ ప్రాతిపదికన కాకుండా రెగ్యులర్ పద్ధతిపై స్టాఫ్‌నర్సుల పోస్టులు భర్తీ చేయాలని, అర్హత ఉన్న కాంట్రాక్టు నర్సింగ్ ఆఫీసర్స్‌కు వంద శాతం గ్రాస్ సాలరీ వర్తింపజేయాలని కోరారు.

గ్రామ నమూనా రూపకల్పన

పెదకాకాని: నంబూరు గ్రామ నమూనాను వ్యవసాయ కళాశాల విద్యార్థులు రూపొందించారు. గ్రామీణ వృత్తులపై అవగాహన కార్యక్రమంలో భాగంగా కేఎల్‌యూ వ్యవసాయ కళాశాల విద్యార్థులు పెదకాకాని మండలంలోని నంబూరు గ్రామంలో పర్యటించారు. గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణలో భాగంగా శనివారం శ్రీనాగారపమ్మ ఆలయ ప్రాంగణంలో గ్రామ నమూనాను రూపొందించారు. నివాసాలు, పంట పొలాలు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, పంట కాలువలను చూపిస్తూ రకరకాల రంగవల్లులతో అలంకరించారు. తిలకించిన రైతులు, ప్రజలు విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు మేఘన, లక్ష్మి, వెన్నెల, వాసవి, వసుప్రద, తేజస్వి, పూజిత, మౌనిక, హవిలా, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

విద్యుత్ మోటార్ కేబుళ్ల చోరీ



కొత్తరెడ్డిపాలెంలో దొంగలు కత్తిరించిన కేబుల్ వైర్లు

చేబ్రోలు: మండల పరిధిలోని కొత్తరెడ్డిపాలెం గ్రామంలోని మెట్ట భూముల్లో సాగునీటి మోటార్లకు అమర్చిన కేబుల్ వైర్లను దొంగలు ఎత్తుకెళ్లారు. కొత్తరెడ్డిపాలెం, గుండవరం గ్రామాల పరిధిలో 30 మంది రైతులకు చెందిన రాగితీగలతో కూడిన వైర్లను చోరీ చేశారు. ఈ సొత్తు విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని రైతులు శనివారం ఫిర్యాదు చేశారు. మెట్ట భూములకు గత ప్రభుత్వం జలసిరి పథకం కింద బోర్లు వేయించింది. మోటార్లకు ఉచిత విద్యుత్ కనెక్షన్ ద్వారా పంటలు సాగు చేస్తున్నారు. విద్యుత్ సరఫరా చేసే కేబుల్స్‌లోని రాగి తీగ కోసం ఆటోలు వచ్చిన దొంగలు వాటిని ఎత్తుకెళ్లారు. ఇప్పటికే పలుమార్లు ఈ తరహా ఘటనలు జరిగాయి. నారాకోడూరు, చేబ్రోలు, వడ్లమూడి తదితర గ్రామాల్లో మోటార్లను కూడా దొంగలు మాయం చేస్తున్నారు. దీనిపై ఇప్పటికే అనేక ఫిర్యాదులు పోలీసులకు అందాయి.